వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, నవంబర్ 15, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

'నన్ను అరెస్ట్ చేస్తారా.. చేస్కోండి': కేటీఆర్

నేను ఏ తప్పు చేయలే .. అందుకే నేను భయపడను. ఈ రేస్ అయినా ఇంకేదైనా. అరెస్టు చేసుకుంటే చేసుకో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. గురువారం రాష్ట్ర రాజకీయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

చిట్‌చాట్‌లో కేటీఆర్ ఏమన్నారంటే..

ఎస్సీ నారాయణ రెడ్డి కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్ని వదిలేసి బీఆర్ఎస్ శ్రేణుల్ని కొట్టారు. దీనిపై మేధావులు ఎవరు మాట్లాడలేదు. పోలీసుల తీరు సరిగా లేదు. పోలీసులు వైఫల్యం ఉంది. ఇంటిజెన్స్ వ్యవస్థ అట్టర్ ఫ్లాప్ అయింది. రేవంత్‌రెడ్డి సైన్యంలా పరిస్థితి తయారైంది. రైతులు,బీఆర్ఎస్ శ్రేణుల్ని ఉగ్రవాదుల్ని అరెస్ట్ చేసినట్లు చేస్తున్నారు. నేను ఊరుకోను. రేవంత్ రెడ్డి నీ సంగతి తేలు. లగచర్ల బాధితులను

(మిగతా 2వ పేజీలో)

నాణ్యత లేకుంటే జైలే!: సీఎం రేవంత్

హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సీఎం హెచ్చరిక

గురుకులాల్లో నాసిరకం భోజనం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోంది

సివిల్ సర్వెంట్లు వారానికి రెండు రోజులు పాఠశాలలకు వెళ్లాలి

ప్రజా ప్రతినిధులు కూడా పాఠశాలలకు వెళ్లి భరోసా కల్పించాలి

కులగణనపై తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలన్న సీఎం

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాలకు నాసిరకం బియ్యం, కూరగాయలు సరఫరా చేస్తే కాంట్రాక్టర్లతో ఊచలు లెక్కబెట్టిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కలుషిత ఆహారం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో నాసిరకం భోజనం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని, దీన్ని దృష్టిలో ఉంచుకునే కేటాయింపులు పెంచామని తెలిపారు. విద్యార్థి నులకు కాస్మెటిక్ చార్జీలు సకాలంలో చెల్లిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు ఆపి అయినా, విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని గ్రీన్ చానల్ ద్వారా సకాలంలో ఇవ్వాల్సిందిగా ఆదేశించామన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు వారానికి రెండుసార్లు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. ఈ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే వారికి భవిష్యత్ ప్రయోజనాల్లో ప్రాధాన్యత ఇవ్వబోమని

(మిగతా 2వ పేజీలో)

ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు ఎన్నిక

కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపిన అయ్యన్న, చంద్రబాబు, పవన్

రఘురామను అభినందించిన కూటమి ఎమ్మెల్యేలు

లక్కీ పర్సన్ అంటే రఘురామకృష్ణరాజు అనే చెప్పాలి. గతంలో ఎంపీ అయి ఉండి, నియోజ కవర్గంలో అడుగుపెట్టలేనంతగా తీవ్ర సమస్యలను ఎదుర్కొని, మొన్నటి ఎన్నికల్లో ఎంపీ టికెట్ వస్తుందో రాదో తెలియకుండా, చివరికి ఎమ్మెల్యే టికెట్ పై పోటీ చేసి... గెలుపొంది... నేడు ఏకంగా డిప్యూటీ స్పీకర్ గా ఎన్నికయ్యారు. అంతకంటే భాగ్యం ఏమిటంటే... రఘురామను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వంటి హేమాహేమీలు చైర్ వద్దకు సగౌరవంగా తీసుకునివెళ్లి కూర్చో బెట్టారు. వారి వెంట బీజేపీ తరఫున విష్ణుకుమార్ రాజు కూడా ఉన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చైర్ లోంచి లేచి రఘురా మను కూర్చోబెట్టారు. ఏపీ అసెంబ్లీ ఉప సభాపతిగా ఎన్నికైన రఘురామ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు చంద్రబాబు, పవన్, అ య్యన్న శుభాకాంక్షలు తెలిపారు. ఇతర కూటమి ఎ మ్మెల్యేలు చైర్ వద్దకు వెళ్లి రఘురామకు అభినందనలు తెలిపారు. అంతకుముందు, చైర్ వద్దకు వెళ్లే క్రమంలో రఘురామ... చంద్రబాబుకు పాదాభివం దనం చేసి కృతజ్ఞతలు తెలిపారు. పవన్ ను ఆత్మీ యంగా హత్తుకుని హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించం

రైతుల ముసుగులో అధికారులపై బీఆర్ఎస్ ప్రేరేపిత దాడి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్ర జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అధికారం కోల్పోయిన అక్కసుతో అమాయక రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. చిల్లర, అవకాశవాద, కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేరనే విషయాన్ని బీఆర్ఎస్ గుర్తించాలని, పార్టీ ఉనికి కోసం అమాయక రైతులను బలిపెట్టొద్దని గురువారం ఒక ప్రకటనలో ఆ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించబోమని, చట్టం తన పని తాను చేసుకుంటూ వెళు తుందన్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని విమర్శించారు. కలెక్టర్‌పైనే హత్యకు భారీగా కుట్ర పన్నారని, రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు

(మిగతా 2వ పేజీలో)

మండలిలో మంటలు

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రచ్చరచ్చ

అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం

జగన్ వల్లే ఆర్థిక వ్యవస్థ కుదేలు: యనమల

గత ప్రభుత్వంలో సభ్యులను మాట్లాడనివ్వలేదు

వైసీపీ ఒప్పుకొంటే అదే సంప్రదాయం పాటిద్దాం: పయ్యావుల

వైసీపీ అవకతలు సరిచేసి.. రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం: అనిత

అమరావతి, నవంబరు 14 : శాసనమండలిలో గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార కూటమి సభ్యులు, ప్రతిపక్ష వైసీపీ సభ్యుల మధ్య మాటల మంటలు చెలరేగాయి. ఇరుపక్షాల మధ్య ప్రతి అంశంలోనూ వాగ్యుద్ధం చోటుచేసుకుంది. ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నించిన వైసీపీ సభ్యులకు మంత్రులు, కూటమి సభ్యులు దీటుగా బదులిచ్చారు. అసత్యాలు, అబద్దాలు మాట్లాడుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సభ సంప్రదాయాలు మార్చాలని బొత్స సూచించడంతో 'గత ఐదేళ్ల రికార్డులు తీసి అప్పుడు ఏ సంప్రదాయాలు పాటించారో వాటిని పాటిద్దామా..?' అంటూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు.. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన

(మిగతా 2వ పేజీలో)

కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు ముందడుగు

నిర్మాణానికి 950 ఎకరాల భూమి గుర్తింపు

పది రోజుల్లో ఏఏఐ ప్రీ ఫీజిబులిటీ అధ్యయనం

వరంగల్ తరహాలో భారీ విమానాశ్రయ నిర్మాణం

పెద్ద విమానాలు సైతం దిగేలా రన్‌వే

రాష్ట్రంలో మూడో విమానాశ్రయానికి వేగంగా అడుగులు

హైదరాబాద్: వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి రన్‌వేతో పెద్ద విమానాశ్రయాన్ని నిర్మించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ పనులు ప్రారంభమయ్యేనాటికి రాష్ట్రంలో మూడో విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను కూడా కొలిక్కి తేవటానికి చర్యలు ప్రారంభించాయి. హైదరాబాద్, వరంగల్ విమానాశ్రయాల తర్వాత మూడో విమానాశ్రయాన్ని కొత్తగూడెంలో నిర్మించాలని నిర్ణయించాయి. ఇది కూడా రాష్ట్రంలో కీలక విమానాశ్రయంగా మారుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖను కోరింది. ఆ శాఖ కూడా సానుకూలంగా స్పందించింది. దీంతో వరంగల్ తరహాలో దీన్ని కూడా వేయి ఎకరాల్లో నిర్మించేందుకు ప్రాథమిక కసరత్తు మొదలైంది.

పది రోజుల్లో సర్వేకు ఏఏఐ బృందం

విమానాశ్రయం కోసం గుర్తించిన ప్రాంతానికి సంబంధించి గత పదేళ్ల

నాణ్యత లేకుంటే జైలే!: సీఎం రేవంత్

చెప్పారు. ప్రజా ప్రతినిధులు కూడా స్కూళ్లకు వెళ్లాలన్నారు. కుల గణనపై కొంతమంది కుట్ర చేస్తున్నారని, దీన్ని విద్యార్థి లోకం సమర్థవంతంగా తిప్పికొట్టాలని కోరారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లాల నుంచి వచ్చిన బాలలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు.

ప్రభుత్వ స్కూళ్లపై విశ్వాసం పెంచాలి

'ప్రభుత్వ స్కూళ్ల ప్రతిష్ట దెబ్బతింటోంది. గత ప్రభుత్వ హయాంలో ఐదు వేల పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్రంలో 26 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతుంటే, 36 లక్షల మంది ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్నారు. అన్ని సౌకర్యాలున్నా, అర్హులైన టీచర్లు ఉన్నా ఈ పరిస్థితి ఎందుకుందో ఆత్మ విమర్శ చేసుకోవాలి. కలెక్టర్లు, ఎస్పీలు స్కూళ్లకు వెళ్లాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లకు వెళ్ళాలి. విద్యార్థుల్లో విశ్వాసం కల్పించాలి. రెసిడెన్షియల్ స్కూళ్ళలో సన్న బియ్యంతో అన్నం పెట్టాలి. అందుకే రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

విద్యా రంగానికి పెద్దపీట

'విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. 20 వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 35 వేలమంది టీచర్ల బదిలీలు పూర్తి చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. ప్రభుత్వ స్కూళ్ళకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. వర్సిటీలకు వీసీలను నియమించాం. త్వరలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. గత సీఎం మనవడి కుక్క చనిపోతే డాక్టర్‌ను జైల్లో పెట్టారు. విద్యార్థులు చనిపోతే కనీసం కన్నీరు కూడా పెట్టలేదు..'అని రేవంత్ అన్నారు. 'తెలంగాణకు విద్యార్థులే పునాదులని, తమ ప్రభుత్వం చేకూర్చే ప్రయోజనాలను అందరికీ తెలియజెప్పాల్సిన బాధ్యత వారిదేనని అన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి వ్యసనాలకు బానిసలం కాబోమని, ఉన్నత విద్యలో రాణిస్తామని ప్రమాణం చేయాలని బాలలను సీఎం కోరారు. చదువులోనే కాదు.. క్రీడల్లో రాణించినా ఉద్యోగాలు ఇస్తామని సీఎం ప్రకటించారు.

కుల గణన మెగా హెల్త్ చెకప్ లాంటిది

'కులగణనను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయి. తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఇది సమాజానికి మెగా ఆరోగ్య పరీక్ష వంటిది. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అన్ని వర్గాలకు పెరగాలన్నా, నిధుల కేటాయింపు జరగాలన్నా కుల గణనే కీలకం. కులగణన ఆధారంగా భవిష్యత్తులో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అందుబాటులోకి తేవాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. దీనిద్వారా ఎవరి ఆస్తులూ లాక్కోవడం జరగదు. సంక్షేమ పథకాలు అందకుండా పోవడం అంటూ ఉండదు. విద్యార్థులు కూడా కులగణన వివరాలు అందరికీ అర్థమయ్యేలా చెప్పాలి..'అని రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్లానింగ్ బోర్డు చైర్మన్ చిన్నారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యా డైరెక్టర్ నర్సింహారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పుస్తకాన్ని, తెలంగాణ విద్యా ప్రగతి సూచించే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు పారితోషికం అందజేశారు

'21 ఏళ్ళకే పోటీ చేసే హక్కు'తీర్మానం చేయండి

ఎస్‌సీఈఆర్‌టీలో గురువారం జరిగిన అండర్ 18 విద్యార్థుల నమూన అసెంబ్లీ సమావేశ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయాల్లో పోటీ చేసే వయసును 25 ఏళ్ళ నుంచి 21 ఏళ్ళకు తగ్గించాలని, ఈ విధంగా చేసిన మాక్ అసెంబ్లీ తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపాలని సూచించారు. రాష్ట్ర అసెంబ్లీలోనూ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. ఓటు హక్కుకు అర్హత 21 ఏళ్ళుగా ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు 25 ఏళ్లకు లభించేదని, ఇప్పుడు ఓటు హక్కుకు అర్హత 18 ఏళ్ళకు తగ్గింది కాబట్టి పోటీ చేసే వయసును కూడా 21 ఏళ్ళకు తగ్గిస్తే ఎక్కువమంది యువత రాజకీయాల్లోకి వస్తారని సీఎం పేర్కొన్నారు.

మండలిలో మంటలు

హామీలు నెరవేర్చలేదని, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించడంతో.. 'అసత్యాలు చెప్పొద్దు.. ఇప్పటికే సూపర్ సిక్స్‌లో కొన్ని అమలు చేశాం. మిగిలినవి కూడా అమలు చేసి తీరుతాం' అని కూటమి సభ్యులు స్పష్టం చేశారు. 'జగన్.. మద్యపాన నిషేధం అన్నారు.. వారంలో సీపీఎస్ రద్దు అన్నారు.. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదు..?" అని నిలదీశారు. బడ్జెట్‌పై చర్చంతా అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధంగా సాగడంతో.. చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

జగన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ పతనం..: యనమల

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా గత జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. జగన్ హయాంలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కొలాప్స్ అయిందని విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అప్పులు ఎలా పెంచారో కాగ్ రిపోర్టు స్పష్టం చేసిందన్నారు. తాను చేసిన అప్పులపై జగన్ సొంత పత్రికలో ఘనంగా చెప్పుకున్నారన్నారు. కాగ్ అభ్యంతరాలకు జగన్ ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పలేకపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.14లక్షల కోట్లు అప్పు చేసి.. ఆ మొత్తాన్ని దే నికి ఖర్చుపెట్టారో ఎక్కడా స్పష్టంగా చెప్పలేదన్నారు. గత ప్రభుత్వానికి సంబంధించి ప్రస్తుతం రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బిల్లులు మొత్తం అప్పుల కిందకే వస్తాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం సంపద సృష్టించకపోగా.. రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని పరిస్థితి తెచ్చిందన్నారు. ఆ గుంతలు పూడ్చడానికి తాము డబ్బులు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చితికిపోవడానికి ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వమేనని, ఏడాదికి రూ.50వేల కోట్లు వడ్డీలు కట్టాల్సిన దుస్థితి తెచ్చిందని మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఆర్థిక వృద్ధి రేటు -4.2గా నమోదైందని, గ్రోత్ రేట్ నెగిటివ్ ఉన్నప్పుడు రెవెన్యూ ఎప్పటికీ పెరగదని చెప్పారు. ఈ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కొంత సమయం పడుతుందన్నారు. వృద్ధి రేటును -4.2 నుంచి 15 శాతానికి పెంచడమే లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తున్నారని చెప్పారు.

సర్వనాశనం చేసింది వైసీపీ ప్రభుత్వమే: పయ్యావుల

మండలిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం నడిచింది. వైసీపీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మంత్రులు పదేపదే అడ్డుపడుతున్నారంటూ బొత్స వ్యాఖ్యానించారు. సభ్యుల ప్రసంగం తర్వాతే మంత్రులు సమాధానమివ్వాలని.. లేదా ప్రొసీజర్లు మార్చాలని సూచించారు. ఈ సూచన పట్ల పయ్యావుల ఘాటుగా స్పందించారు. "గత ఐదేళ్లలో బొత్స మంత్రిగా ఉన్నప్పుడు పాటించిన సాంప్రదాయం పాటిద్దామా?" అని ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉండగా మంత్రులు తరచూ అడ్డుపడేవారని, సభ్యులు మాట్లాడితే.. అధికార పార్టీ సభ్యులు ఎదురు దాడి చేసేవారని గుర్తుచేశారు. 'గత ఐదేళ్లలో సభలో ఎలాంటి సంప్రదాయాలు పాటించారో చూద్దాం. వైసీపీ సభ్యులు ఒప్పుకుంటే అదే సంప్రదాయాలు పాటిద్దాం' అన్నారు. వైసీపీ సభ్యులు చెప్పే అసత్యాలు లైవ్‌లో ప్రజల్లోకి వెళుతున్నాయి కాబట్టే తాము జోక్యం చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఈలలు, కేకలు వేయించుకునేందుకు పబ్లిక్‌లో మాట్లాడినట్టు.. వైసీపీ సభ్యులు సభలో మాట్లాడతామంటే కుదరదన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా మాట్లాడితే తమకు అభ్యంతరం లేదన్నారు. వైసీపీ సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. రన్నింగ్ కామెంటరీలు మాట్లాడినా, ప్రభుత్వంపై బురదజల్లాలని చూసినా.. తమ సభ్యులు వెంటనే స్పందిస్తారన్నారు. తప్పులు ఉంటే చెబితే సరి చేసుకుంటామన్నారు.

ఐదేళ్లు వదిలేసి.. ఇప్పుడు విమర్శలా?: హోంమంత్రి అనిత

గత ఐదేళ్లు అల్లకల్లోలం చేసి వదిలేసి.. ఇప్పుడు 5నెలల ప్రభుత్వంపై వైసీపీ సభ్యులు విమర్శలు చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై వైసీపీ సభ్యుల మాటలకు ఆమె స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'స్త్రీనిధి కింద మహిళలకి రూ.3,500 కోట్లు కేటాయించినా.. ఇవ్వలేదంటారా..? జగన్ పత్రికలో కథనాలను సభలో నిజాలుగా ప్రస్తావించడం విడ్డూరం. గతప్రభుత్వంలో ఉద్యోగులకు సరిగా జీతాలే ఇవ్వలేని దుస్థితి. టీఏ, డీఏ, పీఆర్సీ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నరకం చూపించారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత ఉద్యోగులు ఒకటో తేదీన జీతాలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ఉచిత సిలిండర్ల పథకం చూసి ఓర్వలేకే ఇలా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ అవకతలను.. సరిచేసుకుంటూ గాడిలో పెట్టేందుకు ప్రయత్నించడం వల్లే ఆలస్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాం'అన్నారు.

పుస్తక పఠనం ద్వారా బంగారు భవిష్యత్తు సిద్ధిస్తుంది

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ లైబ్రరీలకు, పుస్తకాలకు దగ్గరవ్వాలని.. సోషల్ మీడియాకు దూరమవ్వాలని యువతకు పిలుపు

విశాఖపట్టణం వార్త మిర్రర్ : పుస్తక పఠనం ద్వారా అజ్ఞానం తొలగిపోతుందని, పేదరికం కనుమరుగైపోతుందని, యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థులు, యువత లైబ్రరీలకు రావాలని, పుస్తకాలు చదవటం అలవాటుగా మార్చుకోవాలని, లక్ష్యాలను చేరుకోవాలని హితవు పలికారు. సూర్యాబాగ్ లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు మనందరికీ దారిచూపే లైట్ హౌస్ లు లాంటివని అభివర్ణించారు. పేదరికాన్ని తొలగించి వెలుగురేఖలు నింపే సాధనాలుగా గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవటం నిత్య అలవాటుగా మార్చుకోవాలని హితవు పలికారు. అలాగే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని అదే ప్రాంగణంలోని నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో భాగంగా వాటి ఆవశ్యకత, ఉనికి, ప్రయోజనాల గురించి కలెక్టర్ ఉపదేశించారు. పత్రికలు, పుస్తకాలు చదవటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, జీవితంలో చీకటి తొలగిపోతుందని పేర్కొన్నారు. గ్రంథాలయాలను సరిగ్గా వినియోగంచుకొని యువత భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అబ్దుల్ కలాం వంటి ఎంతో మంది మహనీయులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నారని, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. చాలా మంది యువత ముబైల్ వినియోగానికి ఎక్కువ సమయం వృథా చేసుకుంటున్నారని, అలా కాకుండా వారి సమయాన్ని పుస్తకాలు చదవడానికి, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవటానికి వెచ్చించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయల్లో ప్రధాన పత్రికలు, మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. చెన్నైలోని అన్నా సెంట్రల్ లైబ్రరీ వద్ద ఎంతో మంది సివిల్ యాస్పిరెంట్స్ ఎక్కువ సమయాన్ని గడుపుతారని, వారి లక్ష్యాలను చేరుకుంటున్నారని గుర్తు చేశారు. చదువు ద్వారానే ఏదైనా సాధించుకోవచ్చని ఈ విషయాన్ని యువత గుర్తించి ముందుకు సాగాలని కలెక్టర్ హితవు పలికారు,

ప్రభుత్వ ప్రోద్బలంతో లైబ్రరీల అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రోద్బలం, విద్యాశాఖ మంత్రి సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల మంత్రి స్థానికంగా ఉన్న లైబ్రరీలను సందర్శించారని, కొన్ని సూచనలు చేశారని గుర్తు చేశారు. ఆ మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే తగిన కార్యాచరణతో ముందుకెళ్తామని వివరించారు. అనంతరం కలెక్టర్ లైబ్రరీలోని అన్ని విభాగాలను సందర్శించారు. అక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు, డివిజనల్ పీఆర్వో డి. నారాయణరావు, స్థానిక ఎంఈవోలు, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

'నన్ను అరెస్ట్ చేస్తారా.. చేస్కోండి': కేటీఆర్

ఢిల్లీకి తీసుకుపోయి.. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తా. నేను ఏ తప్పు చేయలే.. అందుకే నేను భయపడను. ఈ రేస్ అయినా ఇంకేదైనా. అరెస్టు చేసుకుంటే చేసుకో. మీలాంటి వాళ్ళను చాలా మందిని చూశా. నీ కుర్చీ కాపాడుకో. ఎన్ని రోజులు ఉంటావో. ఉత్తమ్, భట్టీ నీ కుర్చిలో కూర్చుంటారు. బాంబులు పేల్చేది నీ మీదనే.. మీ పార్టీలోనే. మూసీ కోసం రేవంత్ కొత్తగా చేసిందేమీ లేదు. డబ్బు దండుకోవడమే. డీపీఆర్ లేకుండా రూ. లక్ష 50వేల కోట్లు ఎలా అవుతాయ్ రేవంత్. ఢిల్లీకి డబ్బులు పంపాలని ప్లాన్ చేశారు. నీ నియోజకవర్గంలో సమస్యనే పరిష్కరించలేని నువ్వు ఓ ముఖ్యమంత్రివి. నీదో కథ' అని కేటీఆర్ చిట్‌చాట్‌లో వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, దీనివెనుక ఎవరున్నారో కూడా అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి, స్థానికుల సమస్యలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, కుట్రపూరిత చర్యలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. రైతులకు నష్టం కలిగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొనే ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. అధికారులపై దాడి జరిగినట్టుగానే భవిష్యత్‌లో రాజకీయ నాయకులకో, ప్రజలకో జరిగితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ప్రజలను కాపాడుకున్నట్టే, అధికారులను కాపాడుకోలేకపోతే పనిచేయడానికి ఎవరు ముందుకు వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. ఇసుక దందాలకు అడ్డువస్తున్నారని, సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని నేరెళ్లలో దళితులను ట్రాక్టర్‌తో తొక్కించి పోలీస్‌స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన హింసను భరించలేక 2021 జూన్ నెలలో వేములఘాట్ రైతు తూటుకూరి మల్లారెడ్డి, కూల్చివేసిన తన ఇంటిలోని కట్టెలను పోగుచేసి, దానినే చితిగా మార్చుకొని ఆత్మార్పణ చేసుకున్నాడని పేర్కొన్నారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన బాధలను భరించలేక ఏకంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. గడచిన 11 నెలలుగా ప్రతి విషయంలోనూ ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు.

రాజ్యాంగ పాలనా.. రాచరికమా?

సీఎం సోదరుడు రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు

బీఆర్ఎస్ మాజీ మంత్రుల ధ్వజం

హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యాంగ పాలనకు బదులుగా రాచరిక పాలన చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ మంత్రులు విమర్శించారు. లగచర్లలో వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటనలో రైతులు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వి.శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రజలు చేసిన తిరుగుబాటును కుట్రగా పేర్కొంటూ.. రైతులు, విపక్ష నేతలను అరెస్టు చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఎంపీ డీకే అరుణను లగచర్లకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి మాత్రం 200 వాహనాల్లో తిరిగే స్వేచ్ఛను ఇచ్చారన్నారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫోన్‌లో మాట్లాడారనే విషయాన్ని నేరంగా చూపుతూ పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూస్తే ఉద్యమిస్తామన్నా రు. రైతులపై కేసులను ఉపసంహరించుకోవాలని, అవసరమైతే బీఆర్ఎస్ మూకుమ్మడి జైల్ భరోకు పిలుపునిస్తుందని నిరంజన్‌రెడ్డి చెప్పారు.

అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్

ఎన్నికల హామీలు అమలు చేయడం చేతకాని రేవంత్‌ను బీఆర్ఎస్ నిలదీస్తుండటంతో అరెస్టులతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. లగచర్ల ఘటనలో కట్టు కథలు చెప్తూ.. బీఆర్ఎస్‌ను బద్‌నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దాడులను ప్రోత్సహించడం బీఆర్ఎస్ విధానం కాదని, అధికారులు గ్రామాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుని వెళ్లాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రేవంత్ రెడ్డిపై నమ్మకం లేనందునే కొడంగల్ ప్రజలు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేరని ఎంపీ సురేశ్ రెడ్డి అన్నారు.

నాపై కేసు రాజకీయ ప్రేరేపితం: పట్నం

హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన ప్రమేయం లేదని, రాజకీయ ప్రేరేపణతో తనపై కేసు నమోదు చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురు వారం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలు లేకుండా తనపై నమోదు చేసిన కేసును, వికారాబాద్ జిల్లా కొడంగల్ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆదేశాలను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. 'బొమ్రాస్‌పేట్ స్టేషన్‌లో నమోదైన కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. కేవలం నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే నన్ను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు కనీసం కారణాలను వెల్లడించలేదు. న్యాయవాదితో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. పోలీసులు తూతూ మంత్రంగా దాఖలు చేసిన రిమాండ్ డైరీని ట్రయల్ కోర్టు ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసింది. టీఐఐసీ కోసం భూమి కోల్పోయే బాధితులే అధికారులపై దాడి చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా, దురుద్దేశంతో, రాజకీయ కారణాలతో నమోదు చేసిన కేసులో విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలి..'అని నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ ఈనెల 18న విచారణకు వచ్చే అవకాశం ఉంది.

పోలీసులు కట్టుకథ అల్లారు

కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన పాత్ర ఉందంటూ పోలీసులు కట్టు కథ అల్లారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాలతో రైతులను దాడులకు పురికొల్పినట్లుగా తాను నేరాంగీకార ప్రకటన ఇచ్చానని పోలీసులు చెబుతున్నట్లు తెలిసిందన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డి.. ఈ మేరకు గురువారం తన న్యాయవాదుల ద్వారా కొడంగల్ కోర్టును ఉద్దేశించి అఫిడవిట్ పంపించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న తనను పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు. ఆ తర్వాత పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కొన్ని కాగితాలపై సంతకాలు తీసుకుని కోర్టుకు తీసుకెళ్లారన్నారు. కోర్టులో ప్రవేశ పెట్టిన తర్వాత లగచర్ల ఘటనలో తాను ప్రథమ ముద్దాయిగా ఉన్నట్లు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. తన అరెస్టు విషయంలో పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని, అరెస్టు సమాచారాన్ని కనీసం తనకు కానీ, తన కుటుంబానికి కానీ ఇవ్వలేదని తెలిపారు. తాను అఫిడవిట్‌లో పేర్కొన్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని సరైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

బెయిల్ కోసం జిల్లా కోర్టులో పిటిషన్

అనంతగిరి: లగచర్ల ఘటనలో అరెస్టు అయిన తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పిటిషన్ వేశారు. దీనిపై ఈ నెల 18న విచారణ జరుగుతుందని న్యాయవాది శుభప్రద్ పటేల్ తెలిపారు.

విశ్వకర్మలు రాజకీయంగా ఎదగాలి

జాతీయ స్థాయిలో విశ్వకర్మ లీడర్ అవార్డు సాధించిన అందోజు శంకరాచారి

వార్త మిర్రర్, మునుగోడు: వివిధ రంగాలలో విశిష్ట కృషి, సాధన చేసిన వ్యక్తులకు ఇచ్చే విశ్వకర్మ లీడర్ అవార్డు 2024 సంవత్సరం మునుగోడు నియోజకవర్గం బీ ఆర్ ఎస్ నాయకుడు అందోజు శంకరా చారి అందుకున్నారు. జాతీయ స్థాయిలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు ఇచ్చే ఈ అవార్డు బుధవారం దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్ లో అంబేద్కర్ ఆడిటోరియం లో జరిగింది. 17 రాష్ట్రాలకు చెందిన విశ్వకర్మ లు దాదాపు 46 మందికి ఈ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదన చారి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, బీసీ కులాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ విశ్వనాదుల పుష్పగిరి, మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమా చారి పాల్గొని ఈ పురస్కారాలను గ్రహీతలకు అందజేశారు.ఈ సందర్భంగా శంకరా చారి మాట్లాడుతూ విశ్వకర్మ లు రాజకీయంగా ఎదగవలసిన అవసరం ఉందని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నాకు సీటు ఇవ్వడం తెలిసిన దేశంలోని ప్రతీ విశ్వకర్మ గర్వపడ్డారన్నారు. తన ప్రచారం కోసం రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన విశ్వకర్మలకు ఈ వేదిక ద్వారా మరొక్కసారి కృతజ్ఞతలు తెలిపారు. మన పంచకులాలు ఐక్యంగా పోరాడి రాజకీయ వాటా సాధించాలని పిలునిచ్చారు. తెలంగాణ లో ఇప్పుడు

జరుగుతున్న కుల గణనలో వృత్తి ప్రకారం కాకుండా కులం పేరులో విశ్వకర్మలుగా పేర్కొనవలేనని అన్నారు. రాజకీయాలు అంటే డబ్బే ముఖ్యం కాదని అవగాహనతో ప్రజల సమస్యలపై పోరాడి నాయకుడు కావాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో మన జాతి బిడ్డలు పెద్దఎత్తున పోటీ చేయాలని అన్నారు. తెలంగాణ లో విశ్వకర్మ ల ఉన్నతికి పోరాటం చేస్తున్న నాయకులను అభినందిస్తూ సాధించాల్సింది ఇంకా ఉన్నదని అన్నారు.ఈ వేడుకలో సర్దార్ వల్లభాయ్ పటేల్ (స్టాచ్యు ఆఫ్ యూనిటీ) విగ్రహ నిర్మాణ కర్త, అయోధ్య శ్రీ రామ పాదుకలు, యాదాద్రి ఆలయ ఘంటికలు తయారుచేసిన విశ్వకర్మ, డి ఆర్ డి ఎ శాస్త్రవేత్త, క్యాన్సర్ వైద్య నిపుణులు, ఇంకా పలు రంగాలలో సేవలందించిన విశిష్టులకు అవార్డులను అందజేశారు.



చంచెట్టి వారి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

భగీరథ ఆత్మ గౌరవ ట్రస్ట్ మెంబర్ రాసాల వెంకటేష్ సాగర్

రాచకొండ కమిషనరేట్ వార్త మిర్రర్ బ్యూరో (గణేష్ సాగర్)

వనస్థలిపురం కర్నాటి గార్డెన్స్ లో చెంశెట్టి వారి వివాహ మహోత్సవంలో పాల్గొని అరుణ్ కుమార్– శివాని నూతన వధూవరులను ఆశీర్వదించిన భగీరథ ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ మెంబర్ రాసాల వెంకటేష్ సాగర్, రాచకొండ కమిషనరేట్ వార్త మిర్రర్ బ్యూరో గొల్లూరి గణేష్ సాగర్, నల్లగొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏలే భాస్కర్, రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు

ఆహారపు అలవాట్లను నియంత్రించుకోవాలి

విద్యతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారు

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 14

ఆహారపు అలవాట్ల నియంత్రంతోనే మధుమేహాన్ని నియంత్రించవచ్చు అని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవ సందర్భంగా రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రణుతి జూనియర్ కళాశాలలో మధుమేహ(షుగర్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో మధుమేహం యొక్క ప్రాబల్యం 11.4% గా ఉందని, దాదాపు 10.1 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారని యుక్త వయసు ఉన్న వారిలో ఎక్కువగా ప్రభావ చూపుతోందన్నారు. షుగర్ వ్యాధి ఉన్నవాళ్లు జీవనశైలిలో మార్పులు చేయాలని జాగింగ్, ఆటల ఆడటం, కార్డియాక్ వర్కౌట్ల వంటి మితమైన తీవ్రతతో కూడిన వ్యాయామం, కొవ్వు పదార్థాలను తగ్గించేటప్పుడు ప్రోటీన్, ఫైబర్ కంటెంట్‌ను పెంచడం వంటి ఆహార మార్పులు చేసుకోవాలన్నారు. బరువును 5–10%

తగ్గిస్తాయని అన్నారు. సరైన నిద్ర 7–9 గంటలు తీసుకొని ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తూ ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మచ్చ శేఖర్, లయన్స్ క్లబ్ మాజీ డిసీలు మ్యాకల రమేష్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు బొమ్మ కంటి నవీన్, కొత్తపెల్లి రంజిత్, గంట్యాల ప్రవీణ్, సుదవేణి మురళి, పారి పెల్లి శివ ప్రసాద్, ప్రణుతి కళాశాల ప్రిన్సిపాల్ బందెల తిరుపతి, పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు తమకు నైపుణ్యం ఉన్న రంగంలో రాణించాలి: ప్రిన్సిపల్ శ్రీధర్

వార్త మిర్రర్, మల్కాజ్ గిరి :

విద్యార్థులు చిన్నతనం నుండి చదువుతోపాటు తమకు నైపుణ్యం ఉన్న రంగంలో రాణించాలని ప్రొబెల్స్ గార్డెన్ పాఠశాల ప్రిన్సిపాల్ పి శ్రీధర్ పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన క్రీడల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. తమ పాఠశాలలో చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీస్తామన్నారు. క్రీడలలో గెలుపొందిన బద్దుల దివ్యాంక యాదవ్ కు ప్రిన్సిపల్ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహనీయుడు

మిర్యాలగూడ నవంబర్ 14:–(వార్త మిర్రర్) మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ లో గురువారం మాజీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ 135వ శత జయంతి సందర్భంగా నెహ్రు చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మహబూబ్ అలీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని, ఆయన చేసిన సేవలు మరవ రానివని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉబ్బపల్లి సత్యం, నిస్సార్ అహ్మద్, వాలెంటైన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ నవంబర్ 14:–ఆడవిదేవుల పల్లి మండల కేంద్రంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలు అంటే చాలా ఇష్టమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులనే లక్ష్యంతో పిల్లల అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు అమలు చేశారు. అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నెహ్రూ జీవితం ఎంతో మందికి ఆదర్శం, వారి కుటుంబం అంతా ప్రజల కోసం, దేశం కోసం త్యాగం చేశారని అన్నారు. వారినీ ఆదర్శంగా తీసుకొని పిల్లలు అందరూ ఉన్నత చదువులు చదివి దేశానికి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, సీనియర్ నాయకుడు స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

కస్తూరి బాలికల పాఠశాలలో బాలల దినోత్సవం.

రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్...మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

కల్వకుర్తి.కడ్తాల్ నవంబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:–కడ్తాల్ కస్తూరి రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 220 మంది బాలికలకు స్టీల్ ప్లేట్లను ట్రస్ట్ చైర్మన్,మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి ప్రధానోపాధ్యాయులు అనిత ఉపాధ్యాయుల సమక్షంలో బాలికలకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కావాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు పేద బడుగు బలహీన వర్గాలకు సంబంధించి వారు మాత్రమే చదువుకుంటారని వారికి తమ ట్రస్ట్ ద్వారా సహాయం చేయడం తమకెంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు.ఈ సదుపాయాలను ఉపయోగించుకొని విద్యార్థినిలు ఉన్నత స్థాయికి ఎదిగి రానున్న రోజుల్లో వారు కూడా బడుగు బలహీన వర్గాలకు ఏదో ఒక రకంగా సహాయం చేయాలని సూచించారు.అనంతరం సరదాగా విద్యార్థులతో కాసేపు వారి సాధకబాధకాలను పంచుకున్నారు. తమకు ఏ రకమైనటువంటి ఇబ్బందులు వచ్చిన తీర్చడానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి డైరెక్టర్ సేవ్య నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ నాయకులు మంగళపల్లి నరసింహ లక్ష్మణాచారి పాండు రామచంద్రయ్య వెంకటేష్ శ్రీకాంత్ శ్రీను రాజు జగన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 14జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు లో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి స్వయం పాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయు లై తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. క్రమశిక్షణ నైపుణ్యంతో కూడిన విద్య నేర్చుకునే విధానం గూర్చి తెలిపారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురి ని అలరించాయి. విద్యార్థుల పాటలు, నృత్య ప్రదర్శన ద్వారా ఉపాధ్యాయుల గొప్పతనాన్ని చాటిచెప్పారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణ తో కూడిన విద్య నేర్చుకుంటూ విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం బాగా బోధించిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.రాజేశం, పి.రాజ శేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, కె.ప్రశాంత్ పి.రమేశ్, ఎ.పద్మ, ఎ.రజిత, అర్షియాఫర్హీన్, విద్యార్థులు, పాల్గొన్నారు.

నిరుపేదలకుఅన్న దానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 14జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కీర్తిశేషులు ముంజ ధర్మపురి గౌడ్ సంవత్సరీకం కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ముంజ సుజిత్, లలిత్ లు హెల్పింగ్ హీట్ ఫౌండేషన్ సహకారంతో పట్టణంలో గల నిరుపేదలకు అన్నదానం చేశారు. అన్నం మరియు కూరలు వాటర్ బాటిల్ తో సహా పేదలకు అందించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నం శ్రీకాంత్ గౌడ్, లయాన్స్ క్లబ్ అధ్యక్షులు మచ్చ శేఖర్ అడ్వకేట్ కొత్త పల్లి రంజిత్ , తదితరులు పాల్గొన్నారు

దేశ భవిష్యత్తులో విద్యార్థులు పాలుపంచుకోవాలి

-ప్రగతి ప్రిన్సిపాల్ బాలె శేఖర్ పిలుపు.

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 14 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ...దేశ భవిష్యత్తులో విద్యార్థులు పాలుపంచుకోవాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాదులు వేస్తారని, దేశానికి ఉపయోగపడే గొప్ప మేధావులుగా ఎదగాలని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, కష్టమైనా ఇష్టంతో చదవాలని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఈరోజు జన్మదినం జరుపుకుంటున్న పాఠశాల విద్యార్థులచే ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలె జయశ్రీ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతరహిత చేపపిల్లలు

మత్స్య శాఖాధికారులు, కాంట్రాక్టర్ పై ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆగ్రహం

మిర్యాలగూడ, నవంబర్ 14:– (వార్త మిర్రర్ ప్రతినిధి) అడవిదేవులపల్లి టేల్ పాండ్ రిజర్వాయర్ లో చేప పిల్లలు వదిలే కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కార్యక్రమం ప్రారంభించే సమయంలో కొన్ని చేపల పిల్లలు వేసిన అనంతరం చేప పిల్లలలో నాణ్యత లేదని గ్రహించి వెంటనే చేప పిల్లలు వదలకుండా నిలిపివేయాలని ఆదేశించారు.అనంతరం మత్స్య శాఖ అధికారులు, కాంట్రాక్టర్ తో మాట్లాడుతూ చేప పిల్లలలో నాణ్యత లేదని అలాగే చిన్న పిల్లలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం మత్స్య కారులకు అండగా ఉండేందుకు చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమాలు నిర్వహిస్తుంటే మీరు ఇలా నాణ్యత లేని చేపలను విడుదల చేయడం వలన ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం , అధికారులు ఇలా నిర్లక్ష్యం చేసి రైతులకు నష్టం జరిగేలా చేయకూడదని అన్నారు.తక్షణమే చేప పిల్లలు అన్నిటినీ రిటన్ చేసి నాణ్యమైన చేప పిల్లలు తెప్పించి మరో రోజు కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, సీనియర్ నాయకుడు స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి చరితరెడ్డి, సహాయ అధికారి అంజయ్య, కాంగ్రెస్ బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

23న నల్గొండలో మాల ఉద్యోగస్తుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలు పోస్టర్ల ఆవిష్కరణ

మిర్యాలగూడ నవంబర్ 14:– (వార్త మిర్రర్ ప్రతినిధి) నల్గొండ జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాల ఉద్యోగస్తుల ఆత్మీయ సమ్మేళనం 23న నల్లగొండలోని జూలకంటి ఇంద్ర రెడ్డి ఫంక్షన్ హాల్ జరుగుతుందని జిల్లాలోనూ మాలలంతా భారీ ఎత్తున తరలిరావాలని మిర్యాలగూడ పట్టణంలో కరపత్రాలు, వాల్ పోస్టర్లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర వైస్ చైర్మన్ తాళ్లపల్లి రవి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట వైస్ చైర్మన్ ముల్లగిరి కాంతయ్య, మాల ఉద్యోగస్తుల జిల్లా చైర్మన్ మాడుగుల శ్రీనివాస్, రాష్ట్ర వైస్ చైర్మన్ గాజుల పున్నమ్మ, సీనియర్ నాయకులు కోడిరెక్క శౌరి రాష్ట్ర కమిటీ మెంబర్ బొప్పని నగేష్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ నాగటి జోసెఫ్, జిల్లా యూత్ అధ్యక్షులు ఎర్రమల దినేష్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ధనమ్మ, నియోజకవర్గ కో కన్వీనర్ ఏ. ఏడుకొండలు నాగటి గిరి, పగిడిపల్లి మట్టయ్య, శివనేని మట్టయ్య అవుట శ్రీను జయరాజు, మాల మహనాడు నాయకులు 23న సభను జయప్రదం చేయాలని కోరారు.

ప్రపంచ మధు మేహ దినోత్సవ సందర్భంగా శ్రీకృష్ణ డయాబెటిక్ ఎండో క్రేన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత బిపి, షుగర్, పిటికేర్ పరీక్షలు

ఎల్బీనగర్ 14, నవంబర్ ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ డయాబెటిక్ %ఉ% ఎండోక్రైన్ సెంటర్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని హుడా పార్క్ ఎదురుగా ఉన్న ఎండో క్రేన్ సెంటర్ లో ఉచిత బీపీ, షుగర్, పిటికేర్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మధుమేహ సదస్సులో బీపీ, షుగర్, ఎండోక్రైనాజలిస్ట్ ప్రముఖ వైద్యులు నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 మధు మేహం దినోత్సవ సందర్భంగా తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో బీపీ షుగర్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సును ప్రజలను అప్రమత్తం చేస్తామని గుర్తు చేశారు. మధుమేహ వ్యాధిని నిరోధించడానికి ప్రతిరోజు ఉదయం 45 నిమిషాల పాటు వాకింగ్ తో పాటు వ్యాయామం సైక్లింగ్ చేయాలని రోగులకు సూచించారు. సమతుల్యమైన ఆహారాన్ని తీసుకొని చక్కర, నూనె తో పాటు మాంసాహార మద్యానికి దూరంగా ఉండాలని డాక్టర్ నాగేందర్ రెడ్డి సూచించారు. ఎప్పటి కప్పుడు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ సదస్సులో వైద్యులు హారికా రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి దశను నుండి క్రీడల పట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలి...అక్కి మాధవీ ఈశ్వర్ గౌడ్

వార్త మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత) .. నవంబర్ 14 ==

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మీర్ పేట్ మునిసిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవీ ఈశ్వర్ గౌడ్ మీర్ పేట్ ప్రభుత్వ పాఠశలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు ఆడుకోవటానికి క్రీడా వస్తువులని అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు చదువు తో పాటు మానసిక ఉల్లాసం ఉండేలా ప్రతీ రోజూ వారికి నైపుణ్యం ఉన్న ఆటను ఆడుకోవాలని చిన్న వయసు నుండే వారికి ప్రోత్సాహం ఇస్తే భవిషత్తు లో మంచి క్రీడా కారులై రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తెస్తారని అమ్మాయిలకు తన సొంత ఖర్చులతో ట్రైనింగ్ ఇప్పిస్తానని తెలిపారు. తల్లి తండ్రులు వారి వారి పిల్లల చదువు తో పాటు వారు ఎ రంగంలో ఆసక్తి ఉంటుందో తెలుసుకొని విద్యార్థి దశ నుంచి క్రీడల్లో ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కాంతా రావు, ఉపాధ్యాయులు లక్షమారెడ్డి, స్థానిక ఆర్ఎస్ఎస్ సభ్యులు రఘు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రినిటీ హైస్కూలో ఘనంగా బాలల దినోత్సవం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 14

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ట్రినిటీ హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా చేశారు.స్కూల్ ప్రిన్సిపాల్ కండైరెక్టర్ ఉజ్జిని మంజుల,చైర్మన్ కేవిబి కృష్ణారావు పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి బాలల దినోత్సవం జరుపుకున్నారు. తనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు విద్యార్థి విద్యార్థులు తమ చిన్నతనం నుండే దేశభక్తి పెంపొందించుకోవాలని దేశం తనకేం చేసిందని కాకుండా మనం దేశానికి ఏం చేశామని అనుకోవాలని అన్నారు. పిల్లలకు దేశభక్తిపై వ్యాసరచన చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

మిర్యాలగూడ మున్సిపల్ లో సమగ్ర సర్వేను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

మిర్యాలగూడ, నవంబర్ 14:-(వార్త మిర్రర్ ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక రాజకీయ విద్య ఉపాధి కుల సర్వేలో భాగంగా గురువారం మిర్యాలగూడ పట్టణంలో రాష్ట్ర పరిశీలకులు పర్యవేక్షణ జరిపారు. పట్టణంలోని సీతారాంపురం, ముత్తిరెడ్డికుంటలలో సర్వేను డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారి జె. రవిచంద్ర, నల్లగొండ జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి. కోటేశ్వరరావులు పరిశీలించారు. తప్పులు దొర్లకుండా చూడాలని కోరారు. పట్టణంలోని ప్రజలు సర్వేకు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్, టీపిఎస్ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఎన్యుమెరేటర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విశ్వకర్మ లీడర్ అవార్డు 2024

-దేశ రాజధాని ఢిల్లీలో అవార్డు అందుకున్న కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి



వార్త మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత) .. నవంబర్ 14 =వివిధ రంగాలలో విశిష్ట కృషి, సాధన చేసిన వ్యక్తులకు ఇచ్చే విశ్వకర్మ లీడర్ అవార్డు 2024 సంవత్సరం అవార్డు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతి చారి అందుకున్నారు.చిన్న వయసులోనే ప్రజాప్రధినిధి గా ఎన్నికై తన డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విశ్వకర్మీయులకు ఆదర్శవంతుడై బిజెపి కార్పొరేటర్ గా తన సేవలు అందిస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారు జాతీయ స్థాయిలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు ఇచ్చే ఈ అవార్డు బుధవారం దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్ లో అంబేద్కర్ ఆడిటోరియం లో జరిగింది. 17 రాష్ట్రాలకు చెందిన విశ్వకర్మ లు దాదాపు 46 మందికి ఈ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదన చారి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, బీసీ కులాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ విశ్వనాదుల పుష్పగిరి, మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమా చారి పాల్గొని ఈ పురస్కారాలను గ్రహీతలకు అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బిక్షపతి చారి మాట్లాడుతూ విశ్వాన్ని సృష్టించిన విశ్వకర్మీయులము అని ప్రపంచానికి కాలజ్ఞాన రూపంలో జరగబోయే నిజాలని ముందే తెలియపరచిన ఆ జగద్గురు శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి వారసులమని తెలంగాణ రాష్ట్ర కోసం అలుపెరుగని పోరాటం చేసిన జాతి పితామహుడు జయశంకర్ వారసులమాని తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుడు లిశ్రీకాంతాచారి వారసులమని ఈ దేశం కోసం ఈ రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన విశ్వకర్మ కుటుంబ వారసులమని ఈ విశ్వకర్మ గా పుట్టినందుకు నాకెంతో గర్వంగా ఉందని ఈ అవార్డు తీసుకున్న వారందరికీ మరింత బాధ్యత పెరిగిందని .నా .మన. కోసం కాకుండా మనందరి కోసం తన వంతు సహాయం చేస్తూ ముందుకు వెళ్లాలని..అని 16 రాష్ట్రాల నుండి విశ్వకర్మలను ఏకం చేసి మన దేశ రాజధాని ఢిల్లీలో ఇంత మంచి ప్రోగ్రాం నిర్వహించిన విశ్వకర్మ నాలెర్జ్ సెంటర్ ఫౌండర్ బ్రహ్మశ్రీ విశ్వనాధుల పుష్పగిరి చారి కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు. ధన్యవాదాలు తెలియజేశారు

జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తా

ఎమ్మెల్యే సంజయ్ కుమార్, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 14సహకార రంగానికి రాష్ట్ర ప్రభుత్వ సహకార ముంటుందని ప్రభుత్వ విప్. ధర్మపురి శాసన సభ్యుడు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లలో సహకార శాఖ ఆద్వర్యములో నిర్వహించిన 71 వ అఖిలభారత సహకార వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ భారత తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జన్మదిన%శీ% నాడు సహకార వారోత్సవాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు జిల్లాలో సహకార సంఘాలు జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ మాట్లాడుతూ పంటల మార్పిడి దిశగా రైతులను సహకార సంఘాల ప్రోత్సహిచాలన్నారు. దేశంలో డైయిరీ రంగంలోను, చక్కర ఉత్పత్తులలోను సహకార సంఘాలు గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాలో తొలిసారి సహకార వారోత్సవాలను నిర్వహించిన జిల్లా సహకార అధికారి సి.హెచ్ మనోజ్ కుమార్ కు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో సహకార సంఘాలు రైసుమిల్లులను స్థాపించే దిశగా యోచించాలన్నారు. సహకార సంఘాల స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మంచి నాణ్యత గల బియ్యాన్ని అందజేసే దిశగా సహకార సంఘాలు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డి.సి.యం.ఎస్. అధ్యక్షులు శ్రీ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో సహకార సంఘం పాత్రను కొనియాడారు. దేశంలో డైయిరీ, గృహ నిర్మాణం, చక్కర ఉత్పత్తి రంగాలలో సహకార శాఖ పాత్రను విస్మరించ బడ్డాయన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాబార్డ్ డీ.డీ.ఎం శ్రీ దిలీప్ చంద్ర మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి నాబార్డ్ తోడ్పాటు న%శీ%దిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమ%శీ%లో జిల్లా వ్యవసాయ అధికారి, శ్రీ. రామచందర్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జ్యోతి, జిల్లా సహకార అధికారి శ్రీ సి.హెచ్. మనోజ్ కుమార్, సహకార సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సహకార వారోత్సవాల్లో ఆకట్టుకున్న డ్రోన్ల ప్రదర్శన జగిత్యాల జిల్లాలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ద్రవరూప యూరియా, పురుగుల మందులను పిచికారి చేసేందుకు సబ్సిడీపై ఇఫ్కో వారు అందజేసిన డ్రోన్ల ప్రదర్శనకు ప్రభుత్వ విప్, జగిత్యాల ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, సహకార సంఘాల అధ్యక్షులు, అధికారులు ఆసక్తిగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ డ్రోన్లు సేవలను మరిన్ని సంఘాలకు విస్తరించాలని కోరారు.

సమగ్ర సర్వేలో వివరాలు నమోదు చేసుకున్న మున్సిపల్ చైర్మన్

మిర్యాలగూడ, నవంబర్ 14:-(వార్త మిర్రర్) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక రాజకీయ విద్య ఉపాధి కుల సర్వేలో భాగంగా గురువారం మిర్యాలగూడలోని కుటుంబ సర్వే బృందం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఇంట్లో వివరాలు నమోదు చేశారు. భార్గవ్ సమాచారం అందించారు. ప్రజలు సర్వేకు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఎన్యుమెరేటర్ పాల్గొన్నారు.

కంఠ మహేశ్వర స్వామికి పంచామృతాలతో జలాభిషేకం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 14

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నుండి శ్రీశ్రీశ్రీ సురమాంబ కంఠ మహేశ్వర స్వామి దేవాలయం వరకు గౌడ కులస్తులు జల బింధలు తీసుకొని రావడం జరిగింది. అనంతరం హెూమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి కంఠ మహేశ్వర స్వామికి పంచామృతాలతో జలాభిషేకం నిర్వహించి వస్త్రాలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మోకు ముస్తాదులకు పూజలు నిర్వహించి అష్టదిగ్బంధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, గౌరవ అధ్యక్షులు బత్తుల లక్ష్మయ్య గౌడ్, అధ్యక్షులు చింతకింది అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు చేవగోని వెంకటేష్ గౌడ్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోర్పునూరి వెంకటేష్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల శ్రీశైలం గౌడ్, సహాయ కార్యదర్శిలు మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, తోర్పునూరి బాబు గౌడ్, కోశాధికారి ఉష్కాగుల రమేష్ గౌడ్, సలహాదారులు తోర్పునూరి మల్లేశం గౌడ్, ప్రచార కార్యదర్శిలు ఉడుగు మల్లేశం గౌడ్, తోర్పునూరు మల్లేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శి చెరుకు లింగస్వామి గౌడ్, సాంస్కృతిక కార్యదర్శి వరగంటి మహేందర్ గౌడ్, సభ్యులు రాజపేట అశోక్ గౌడ్, పేరేపల్లి స్వామి గౌడ్, బోడిగ బాలకృష్ణ గౌడ్, వర్కాల పాండు గౌడ్, తోర్పునూరి శ్రీనివాస్ గౌడ్, చెరుకు సత్యనారాయణ గౌడ్, వర్కాల రవి గౌడ్, ఉస్కాగుల శ్రీశైలం గౌడ్, బొంగు రమేష్ గౌడ్, సలహాదారులు బొంగు జంగయ్య గౌడ్, ఉడుగు ఇస్తారి గౌడ్, పాలకూర్ల స్వామి గౌడ్, ఉష్కాగుల దశరథ గౌడ్, కాసుల వెంకటేశం గౌడ్, మారూపాక సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివగంగా రాజరాజేశ్వరి దేవాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి దీపోత్సవ

వార్త మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత) .. నవంబర్ 14 ==

విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మహేశ్వర శివగంగ రాజరాజేశ్వరి దేవాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో శుక్రవారం జరగబోయే దీపోత్సవ కార్యక్రమం గురించి చర్చించడం జరిగింది.విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం 15-11-2024 రోజున కార్తీక పౌర్ణమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మండల రాజు బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాఘవేందర్ కట్టర్ హిందూ మాట్లాడుతూ మహేశ్వరం శివగంగా రాజరాజేశ్వరి దేవాలయం దగ్గర కార్తీక పౌర్ణమి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. సాయంత్రం 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుంది. అఖండ దీపోత్సవ సమయం 7:45 నిమిషాలకు కావున విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ అధికారులు కార్యకర్తలు అలాగే వివిధ హిందూ సంఘాల కార్యకర్తలు మరియు ప్రతి గ్రామం నుండి పార్టీలకు అతీతంగా హిందూ బంధుమిత్రులు అందరు కూడా ఈ యొక్క కార్యక్రమంలో పాలుపంచుకోగలరని కోరారు. ఈ యొక్క సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మండల రాజు, బజరంగ్ దళ్ సాహ కన్వీనర్ మండల రాజు, మహేశ్వరం ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు రాజేష్, ప్రఖండ కార్యదర్శి వెంకట్, బజరంగ్ దళ్ ప్రకండ కన్వీనర్ విక్రమ్, గణేష్ నవీన్ గారు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం- కేఎల్ఆర్

వార్త మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత) .. నవంబర్ 14 ==

మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ, "సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సాయం అందించడం ఎంతో గొప్ప విషయం. ఈ సహాయం ద్వారా ప్రజల జీవితాలను సులభతరం చేయడం మన బాధ్యత. ప్రజల కోసం పనిచేసే అవకాశం కల్పించిన గౌరవనీయ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మహేశ్వరం నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, ముఖ్యంగా వైద్య ఖర్చుల నిమిత్తం అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా, వారికి ఒక నమ్మకం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ సహాయం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబానికి మేము చేయూత అందిస్తామని, భవిష్యత్తులో మరింత సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటామని" కేఎల్ఆర్ స్పష్టం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఈ చెక్కులు అందజేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన లబ్ధిదారులు కేఎల్ఆర్ కి తమ కృతజ్ఞతలు తెలియజేశారు

జనయేత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి

మిర్యాలగూడ , నవంబర్ 14 :- (వార్త మిర్రర్) మాజీ ప్రధాని భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక జనయేత్రీ ఫౌండేషన్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు రోగులకు పండ్లపంపిణి చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునిర్ అహ్మద్ షరిఫ్ మాట్లాడుతూపిల్లలంటే నెహ్రూకు ఎంతో ఇష్టం ఏ కల్మషం లేని పిల్లల చిరునవ్వు కంటే విలువైనది ఏది లేదని అన్నారు.కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాదగిరి, షాహిర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, నాగరాజు, చైతన్య, అఖిల, సన, మేఘన, జరినా, ఫెరోజా,సునీత, శైలజ, చరణ్, రఫీ, సీతారాం నాయక్, సొహెల్, పాపయ్య, అమీర్అలి పాల్గొన్నారు

గురుకుల పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 14 చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించడం జరిగింది .పిల్లలందరికి వివిధ రకాల ఉపన్యాస, పాటల, మ్యూజికల్ చైర్, క్రీడలకు సంబదించి పోటీలు నిర్వహించటం జరిగింది. ఇందులో ప్రతిభ చూపించిన విద్యార్థినిలకు పాఠశాల ప్రిన్సిపాల్ సరోజ సిబ్బంది ప్రోత్సాహకంగా బహుమతులు ఇవ్వటం జరిగింది. విద్యార్థినుల ఉపాధ్యాయులందరూ ర్యాంపు వాక్ దాండియా ఆడటం జరిగింది. విద్యార్థినిలు అందరూ ఎంతో ఉత్సాహంగ, ఉల్లాసంగా వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలు,లైట్లు ఏర్పాటు చేయించిన మునుగోడు అభివృద్ధి ప్రదాత కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

సంస్థాన్ నారాయణపూర్ అక్టోబర్ 14:(వార్త మిర్రర్) నారాయణపురం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి - సుమరాంబ దేవి బ్రహ్మోత్సవాలకు నారాయణపురం చౌటుప్పల్ రోడ్డులో గల జై హింద్ ఫంక్షలాల్ నుండి కంఠమహేశ్వర స్వామి దేవాలయం వరకు ఎనిమిది స్తంభాలు లైట్లుఏర్పాటు చేపించిన మునుగోడు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఈ యొక్క కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి,నారాయణపురం మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ,దేవాలయ అధ్యక్షులు రాపర్తి కరుణాకర్,గౌడ సంఘం వివిధ కమిటీల సభ్యులు నీళ్ల గాలయ్య,పందులయాదగిరి, పాలకూర్ల యాదయ్య, వీరమల్ల రాజు,బొమ్మని రఘు, కొండ శ్రీకాంత్, బద్దం లింగస్వామి, రాపర్తి ప్రదీప్ తదితరులు స్తంభాలు లైట్ల ఏర్పాటుకు సహకరించినందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు

విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి పథకానికి నిధులు పెంచాలని ఎస్.ఎఫ్.ఐ డిమాండ్

కొండ మల్లేపల్లి నవంబర్ 14 వార్త మిర్రర్ ఎస్.ఎఫ్.ఐ దేవరకొండ కమిటీ ఆధ్వర్యంలో కొండ మల్లేపల్లి మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ రావు కి మధ్యాహ్నం భోజన పథకం నిధులు పెంచాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శి రామావత్ లక్ష్మణ్,బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలను ఎస్.ఎఫ్.ఐ పోరాటం ఫలితంగా పెంచారు. కానీ వసతిగృహాల విద్యార్థులే మధ్యాహ్నం భోజనం పాఠశాలలోనే చేస్తున్నారు. ఎస్.ఎఫ్.ఐ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ లో చదివే విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ పెంచకుండా ప్రైమరీ విద్యార్థులకు 4.97 పైసలతో 6,7,8 తరగతుల విద్యార్థులకు 7.45 పైసలతో 9,10 తరగతుల విద్యార్థులకు 9.95 పైసలతో భోజనాన్ని అందిస్తున్నారన్నారు. ఖైదీలకు 87 రూపాయలతో భోజనం అందించే ప్రభుత్వాలు నేటి బాలలే రేపటి పౌరులు అని చెప్పుకుంటూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటాయని గొప్పలుగా సభలలో చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఈ దేశ భవిష్యత్తు మార్చే విద్యార్థులకు పది రూపాయల లోపు మధ్యాహ్న భోజనం పెట్టడం సిగ్గుచేటు అన్నారు. కాబట్టి తక్షణమే పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించకుండా మధ్యాహ్న భోజనం మెనూ ను పెంచాలని కోరారు. తక్షణమే విద్యాసంస్థలో ఉన్న సమస్యలనుప్రభుత్వ విద్యాధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. మధ్యాహ్న భోజనం మెనూ పెంచుకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్తీక్, వంశిక్రిష్ణ, ,రాజేష్,మనోహర్, మంజుల, స్వాతి,రేణుక నాయకులు పాల్గొనడం జరిగింది.

రింగుల జుట్టు సిన్నోడు డీజే రీమిక్స్ సాంగ్ ప్రోమో పోస్టర్ రిలీజ్

దేవరకొండ నవంబర్ 14 వార్త మిర్రర్ దేవరకొండ పట్టణం లో గురువారం సాయంత్రం స్నాపర్ మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ నిర్మాత ముసిని యశ్వంత్ నేత రింగుల జుట్టు సిన్నోడు డీ జె వెర్షన్ పోస్టర్ ను రిలీజ్ చేశారు.ఈ సందర్భంగా ముసిని అంజిబాబు, యశ్వంత్ నేత లు మాట్లాడుతూ.... శుక్రవారం నవంబర్ 15 వ తేదీ ఉదయం రింగుల జుట్టు సిన్నోడు డిజె రీమిక్స్ సాంగ్ ప్రోమో యూట్యూబ్ లో అప్లోడ్ అవుతుందని ఈ పాట ను ప్రేక్షకులందరూ వీక్షించి, ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.. అలాగే ఈ సంవత్సరం గత మార్చి నెలలో మా ఛానెల్ లోయూట్యూబ్ స్టార్ హీరోయిన్ లాస్య స్మైలీ, అంజిబాబు లు కలసి నటించి వచ్చిన రింగుల జుట్టు సిన్నోడు కాన్సెప్ట్ మెలోడీ పాటను వీక్షకులు ఎంతో ఆదరాభి మానాలతో ఆదరించి పాట ను విజయవంతం చేశారు.అదేవిధంగా ఈ నెల నవంబర్ మొదటి వారం లో జగిత్యాల, కరీంనగర్ పరిసర ప్రాంతాల లొకేషన్లలో రింగుల జుట్టు సిన్నోడు డీజే వర్షన్ పాటను రెండు రోజులు షూటింగ్ చేయడం జరిగిందని వివరాలు తెలియజేసారు.ఈ పాట ను అంజిబాబు ఐడియాలజి కాన్సెప్ట్, అండ్ క్యాస్టింగ్ చేసి .. డీ జె పాటల స్పెషలిస్ట్ డీ జె లింగా మ్యూజిక్ మాయాజాలంతో, సింగర్ ప్రభ లిరిక్స్, న్యాలం మానస అద్దంకి శ్రీను సింగర్స్ లతో ..యూట్యూబ్ లో సెన్సేషనల్, ఫేమస్ కొరియోగ్రాఫర్ శేఖర్ వైరస్ (ఓ పిలగ వెంకటేష్ సాంగ్ కొరియోగ్రాఫర్)కొరియోగ్రఫీలో తన డాన్స్ బృందం తో డైరెక్షన్ చేశారు. హరీష్ పటేల్ డిఓపి నేతృత్వంలో, రంగు అజయ్ డి ఐ కలర్ స్ట్రీమ్ ప్లే , మరియు జగిత్యాల కొమురవెల్లి చిరంజీవి ప్రొడక్షన్ మేనేజర్ గా ,దేవరకొండ జగన్ డాన్స్ మాస్టర్, చైతన్య కరాటే మాస్టర్ పర్యవేక్షణలో డీజే వర్షన్ పాటను రెండు రోజులు అత్యంత నూతన టెక్నాలజీలతో పాటను చిత్రీకరించారని, ఈ పాటలో హీరోయిన్ గా ఈటీవీ డి కంటెస్టెంట్ బిట్టు డాన్సర్, హీరోగా యూట్యూబ్ ఫోక్ యాక్టర్ ముసిని అంజిబాబు లు కలసి చాలా అద్భుతంగా నటించారని ఈ సందర్భంగా తెలిపారు..అలాగే ఈ

పాట కు సహకారం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ ముసిని యశ్వంత్ లక్ష్మణ్ నేత, హీరో అంజిబాబు, పులిపాటి ధనంజి, జగన్ మాస్టర్, ధర్మారపు దేవేందర్, రెడ్డి శివ, యాక్టర్ అమితేష్, కొప్పోలు నిరంజన్, పిట్టల యాదయ్య, నేనావత్ లక్ష్మణ్ ఎండీ రహీం తదితరులు పాల్గొన్నారు

కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలి.... మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో ఓయూలో ఘనంగా కౌండిన్య మహర్షి జయంతి వేడుకలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 14.... ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 14 గౌడ్ కుల మూలపురుషుడు కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ ఆధ్వర్యంలో కౌండిన్య మహర్షి జయంతి జాతీయ వారోత్సవాలను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రకృతిని పూజించే సంస్కృతి ఉందని అన్నారు. ప్రకృతితో పాటు మానవ, వృక్ష, జంతు జాతులను సంరక్షించిన గొప్ప మహానుభావుడు కౌండిన్య మహర్షి అని కొనియాడారు. ఆయన పేరుతో ఆంధ్రప్రదేశ్ లో ఆశ్రమం, వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉన్నాయని చెప్పారు. ఆయన వారసులుగా ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా కౌండిన్య వారసులు పర్యావరణ రక్షణకై, ప్రజారక్షణకై నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. ఆయన జయంతి వారోత్సవాలను ఓయూలో నిర్వహించడం గర్వంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాలకు కేంద్రబిందువుగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈ ఉత్సవాలను నిర్వహించాలనే భావనతో ఇక్కడే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయన కృషి, త్యాగాలను ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎంతో ఉన్నతమైన గీత వృత్తిని హీనంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కోణంలో చూస్తూ, గౌడ్లను ఎదుగనీయకుండా, ఆర్థికంగా బలపడకుండా గీత వృత్తిని చిన్నచూపు చూశారని వాపోయారు. కేసీఆర్ ప్రభుత్వంలో నీరాను మార్కెట్లోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. చరిత్ర పుటలను అధ్యయనం చేసి, నీరా చేసే మేలును తెలుసుకోవాలని సూచించారు. కౌండిన్య ధర్మం ప్రకారం

గౌడ్లంతా పర్యావరణ పరిరక్షణ, మానవతా ధర్మపరిరక్షణ, బహుజన వర్గాలంతా ఐకమత్యంగా ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వట్టికూటి రామారావుగౌడ్ రచించిన 'గౌడ కులదైవాల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ ఉద్యమం నాయకులు మాదు సత్యంగౌడ్, గుండ్రాతి నారాయణగౌడ్, బండి సాయన్నగౌడ్, సూదగాని హరిశంకర్ గౌడ్,బాలగోని బాలరాజుగౌడ్, డాక్టర్ ఆనంద్, ఐలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణగౌడ్, ఎలికట్టె విజయ్కుమార్ గౌడ్, వేములయ్య గౌడ్, సాంబశివగౌడ్, రాముగౌడ్, డాక్టర్ మహేందర్ గౌడ్, రంగోళ్ల మురళీగౌడ్, వెంకటస్వామిగౌడ్, తిరుపతిగౌడ్, నరేందర్ గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, రాజేశ్రిగౌడ్, వెంకటరమణగౌడ్, భానుగౌడ్, బొమ్మగాని శంకర్ గౌడ్, శివరాంగౌడ్, పుట్ట నాగరాజుగౌడ్, అనురాదగౌడ్, లింగంగౌడ్, రాజశేఖర్ గౌడ్, విక్రమ్ గౌడ్, రవీందర్ గౌడ్, వెంకటన్నగౌడ్, కొంపెల్లి వినయ్ గౌడ్, మహేష్గౌడ్,ప్రశాంత్ గౌడ్, రమేష్ గౌడ్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలలకు బహుమతులు అందజేసిన లయన్స్ వనిత డైమండ్

మిర్యాలగూడ , నవంబర్ 14:- (వార్త మిర్రర్)

మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ పార్క్ పాఠశాలలో చాచా నెహ్రూ జయంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ప్రోత్సాహకంగా మిర్యాలగూడ పట్టణ లయన్స్ క్లబ్ వనిత డైమండ్ బహుమతుల ప్రధానం చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు మాశేట్టి శ్రీనివాస్. వనిత డైమండ్ క్లబ్ సభ్యులు ఉప్పల సేవిత, శ్రీనివాస్, సుజాత, మంగతాయారు, విజయ, మాధవి, స్వప్న, కోలా సైదులు, రామ్రెడ్డి, సింగు రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాలలో పకడ్బందీగా కులగణన సర్వేను నిర్వహించాలి

- కుల గణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 14 వార్త మిర్రర్

దేవరకొండ మండల పరిధిలోని సూర్య తండా గ్రామంలో నిర్వహిస్తున్న సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటూ వస్తుందని అందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కుల గణన సర్వేను చేపట్టాము అని అన్నారు.ఆయా వర్గాల వారికి సామాజిక న్యాయం చేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వేను నిర్వహించింది అన్నారు.ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలు ఎన్యూమరేటర్లకు అందించి నమోదు చేసుకోవాలని కోరారు.ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర సమాచారం సేకరించాలని ఎన్యుమారేటర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయరాయణ నాయక్,నేనావత్ గోపాల్ నాయక్,హన్మంతు, రెడ్య, లచ్చిరామ్, కొర్ర రవి నాయక్, దాంజిలాల్, దాస్య,కిషన్,గోపాల్, లాలు, రాజు, మణిపాల్,యువ నాయకులు బాబు రామ్ నాయక్, సుభాష్ నాయక్, ఆర్డీఓ రమణా రెడ్డి,ఎంపిడిఓ డానియల్, ఏఈ శంకర్,అధికారులు శ్రీరామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 14 వార్త మిర్రర్

దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పులిజాల వెంకటయ్య తండ్రి పులిజాల చిన్న మల్లయ్య మరణించిన విషయం తెలుసుకొని నేడు వారి స్వగృహంలో పులిజాల చిన్న మల్లయ్య గారి భౌతిక కాయానికి నివాళు లర్పించి,బాధిత కుటుంబానికి పరామర్శించి,భరోసా కల్పించి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.వారితో పాటు మైనంపల్లి మాజీ ఎంపీటీసీ యువజన కాంగ్రెస్ నేత కొర్ర గౌతమి రాంసింగ్ నాయక్ , సీత్య నాయక్,మాజీ సర్పంచులు పాండు నాయక్,నారాయణ నాయక్,విజయ్ నాయక్,మాజీ వార్డు సభ్యులు శ్రీను నాయక్,గ్రామస్థులు లాలయ్య, ఎల్లయ్య,ముత్యాలు,కిరణ్,మల్లేష్, రాఘవేందర్,వీరయ్య,బద్దు యువ నాయకులు బాబు రామ్ నాయక్,చందంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాయి రాథోడ్ తదితరులు ఉన్నారు.

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి

దేవరకొండ నవంబర్ 14 వార్త మిర్రర్ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండిత్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి అధ్యక్షుడు ఎన్విటి సభ్యులు, చిన్నారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధ్యక్షుడు ఎన్విటీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రము తెచ్చిపెట్టిన మహనీయులను మరువరాదని, వారి యొక్క జయంతి వర్ధంతులను నిర్వహించుకోవాలని, భారతదేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చాచాజీ పండిత్ జి గా ప్రచారం పొందిన రచయిత పండితుడు, రాజకీయవేత, పిల్లలు సమాజానికి పునాదుల వంటి వారు అని, దేశ భవిష్యత్తు వారిపైనే ఆధారపడి ఉందని, లక్ష్యాన్ని సాధించలేని జ్ఞానం నిరుపయోగమైనదని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, బత్తుల అమర్, భాస్కర్ రెడ్డి, రాజకుమార్ రెడ్డి తాళ్ల సురేష్, వేముల రాజు, ఫోటోగ్రాఫ్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్, కరాటే మాస్టర్ శ్రీను, డాన్స్ మాస్టర్ జగన్, హరికృష్ణ ,చక్రపాణి, గణేశ్, కిరణ్ సాయి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సిబ్బంది మహేందర్, జాంగిర్ ,కౌమది, చరణ్, విద్యార్థులు క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత సహకార దినోత్సవం

సింగల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 14 చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 71వ అఖిలభారత సహకార దినోత్సవం సంఘం కార్యాలయం ఆవరణలో సింగల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో సహకార పతక ఆవిష్కరణ చేయడం జరిగింది. సంఘం సభ్యులకు రైతు సోదరులకు సహకార దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ అభివృద్ధికి సహకార సంఘాలు అనేక విధాలుగా తోడ్పడుతున్నాయని అన్నారు. సహకార సంఘాలు గ్రామీణ స్థాయిలో ఉండి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి దోహద పడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు గుండెబోయిన రూపం మల్లయ్య, సిబ్బంది ఎరుకలి రమేష్, మహేష్,బాలరాజు, లింగస్వామి, పాల్గొన్నారు..

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

చందంపేట నవంబర్ 14 వార్త మిర్రర్ బాలల దినోత్సవం పురస్కరించుకొని చందంపేట మండల కేంద్రం లోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ లయన్ వనం శ్రీనివాసులు నాగలక్ష్మిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ,వ్యాసరచన,క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ చందర్ నాయక్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ నీలా బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి లయన్ కుంచకూరి లక్ష్మణ్, వనం శ్రీనివాసులు, గోవింద్ కొండయ్య ఉపాధ్యాయులు విజయ,మధు తదితరులు పాల్గొన్నారు

శ్రీ శ్రీ శ్రీ సత్తి మేరమ్మ యాడి ఆలయ

విగ్రహ ప్రతిష్ఠ లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్:

దేవరకొండ నవంబర్ 14 వార్త మిర్రర్ :::::

దేవరకొండ మండల పరిధిలోని పల్లీ రామ్ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ సత్తి మేరమ్మ యాడి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ లినేనావత్ బాలు నాయక్. అనంతరం ఎమ్మెల్యేని ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఆ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్, నారాయణ నాయక్,నేనావత్ హన్మంతు, పత్తి భావోజీ,గోపి, మణి,యువ నాయకులు బాబు రామ్ నాయక్, సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తిని చాటుకున్న కాయితి ఆశాదీప్ రెడ్డి

కల్వకుర్తి నవంబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో గురువారం సాయంత్రం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో యువ నాయకుడు ప్రేమ్ కుమార్ మా గ్రామంలో ఉండే శివ స్వాములకు వంట సామాగ్రి కావాలని అడిగిన వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి వెంటనే స్పందించి ప్రేమ కుమార్ ఆదేశాల మేరకు తక్షణమే స్వాములకు సరిపడే పంట సామాగ్రిని గ్రామస్తులు సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని స్వాములవారికి సహకరించిన కాయితి ఆశాదీప్ రెడ్డికి గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అధైర్య పడొద్దు అండగా నేనుంటా..!

బిజెపి రాష్ట్రనాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి.

కల్వకుర్తి. ఊర్కొండ నవంబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన బక్క చంద్రశేఖర్ మిడ్జిల్ కస్తూర్బా గాంధి సమీపంలో ఆక్సిడెంట్ లో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. బిజెపి ముచ్చర్లపల్లి నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కరాటే అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి చంద్రశేఖర్ ఆత్మకు శాంతి కలగాలని తెలిపి తక్షణ ఆర్థిక సహాయం రూ"5000 రూపాయలు గ్రామ బిజెపి నాయకుల ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు అందజెయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల యువ నాయకులు యువసేన సభ్యులు కొండం సురేష్,బక్క వెంకటేష్,బక్క శ్రీను శ్రీకాంత్ యాదవ్ నిరటి సంజన్న, కొండం యాదయ్య, కొట్ర శివ,దార శివకృష్ణ,బక్క మహేష్,కొప్పుల దశారతం, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి....అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

ఓయూ ఐపీఈలో ట్రాఫిక్ నిబంధనల పై అవగాహనా కార్యక్రమం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 14... ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హైదరాబాద్ నగర అడిషనల్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) పి. విశ్వప్రసాద్ సూచించారు. నిబంధనలు పాటించకపోవడం వలన అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నివారించాలంటే ట్రాఫిక్ నిబంధనలను పాటించడమే ఏకైక మార్గమని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ (ఐపీఈ) లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీఈకి చెందిన విద్యార్థులు ట్రాఫిక్ విభాగానికి సేవలందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని, నగరంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు మరిన్ని విద్యాసంస్థల్లో నిర్వహిస్తామని చెప్పారు. నగరంలోని జూనియర్, డిగ్రీ, ఇతర కళాశాలల ప్రిన్సిపల్స్తో ఒక ట్రాఫిక్ కాంక్లేవ్ను ఐపీఈ సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. నగర ట్రాఫిక్ విభాగంలో మల్టీమీడియా సెంటర్ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని ఐపీఈ అధికారులు హామీ ఇచ్చారని ప్రకటించారు. ట్రాఫిక్ రద్దీ పరిస్థితి (భారీ వర్షం, రోడ్డుప్రమాదాలు వంటి పరిస్థితుల్లో), ఇతర వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పేందుకు ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియానే ఏకైక సాధనమని అన్నారు. దీనికోసం మల్టీమీడియా సెంటర్ దోహదపడుతుందని వివరించారు. దీని ఏర్పాటు కోసం ఐపీఈ విద్యార్థులు ముందుకు రావడం గొప్ప విషయమని ప్రశంసించారు తార్నాక సిగ్నలను తెరిచేందుకు మతిపాదనలు సిద్ధం చేశామని చెప్పాడు. మరో పదిహేను రోజుల్లో పసులు పూర్తై సిగ్నల్ తిరుచుకుంటుందని ఆశాభావం వ్యర్థం చేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి ట్రాఫిక్ ఏసీపీలు సంపత్ కుమార్, సీఐలు రాంబాబు, సీహెచ్ శ్రీనివాసులు ఏఎస్ఐ వెంకటేశ్వర రావు, ఐపీఈ అధ్యాపకులు ప్రొఫెసర్లు మెహర్ కరుణ, రామకృష్ణ కేవి అనంత కుమార్, శ్రీధర్ రాజ్, డార్టర్ సియాజు, డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ముజామిల్ అహ్మద్, డాక్టర్ రాకేశ్ ఫణీంద్ర, డాక్టర్ షహీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఉచిత మెగా కంటి కంటి వైద్య శిబిరం

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్

- టాస్క్- సీ.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి నవంబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఆమనగల్ పట్టణ కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నవంబర్ 19 మంగళవారం నుండి 27 బుధవారం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలతో పాటు కంటి శుక్లాలకు వెంటనే సర్జరీ చేస్తారని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తమ నెంబర్ తీసుకురావాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరం శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ కల్వకుర్తి రోడ్,ఆమనగల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రాంత ప్రజల కోసం తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్-చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ వారిచే ఏర్పాటు చేస్తున్నఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రాంత ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం వారు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు

ఉప్పరి శేఖర్ సాగర ని మర్యాదపూర్వకంగా కలిసిన

జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్- రాసాల వెంకటేష్ సాగర్

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్ లో వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర ను మర్యాదపూర్వకంగా కలిసిన వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గోల్లూరి గణేష్ సాగర్-భగీరథ ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ మెంబర్ రసాల వెంకటేష్ సాగర్, రాష్ట్రంలో జరుగుతున్న కులణనన సర్వేలపై సగరులకు జరుగుతున్న అన్యాయంపై, జిల్లాలలో ఏర్పాటు అవుతున్న జిల్లా సగర సంఘం కమిటీలపై పలు సమస్యలపై చర్చించారు, గణేష్ సాగర్ మాట్లాడుతూ సగర జర్నలిస్టు ఫోరం ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో జిల్లాలలో సగర సంఘాలు చేస్తున్న కార్యక్రమాలని, సగర హక్కులకై చేస్తున్న పోరాటాన్ని మీడియా ద్వారా, ప్రింట్ మీడియా ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి తెలిసేలా చేయాలని తెలిపారు రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్ సానుకూలంగా స్పందించి త్వరలో సగర జర్నలిస్టు ఫోరం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు

బద్దం వారి అతిథుల

కోలాహలం మధ్య బద్దం శ్రీష జన్మదిన వేడుకలు

నాగోల్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

నాగోల్ (పిఎంఆర్) కన్వెన్షన్ హాల్లో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ కుమారుడు ప్రముఖ వ్యాపారవేత్త బద్దం నిఖిల్ గౌడ్-అలేఖ్య కూతురు బద్దం శ్రీష మొదటి పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ నేత మధుయాష్కి , ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేష్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లెలక్ష్మణరావు గౌడ్, సుర్వి భీష్మ గౌడ్, సుర్వి రజినీకాంత్ గౌడ్, మూల విశాల్ గౌడ్, లింగాల నాగేశ్వరరావు గౌడ్, వజీర్ ప్రకాష్ గౌడ్, తాత నాయనమ్మ బద్దం భార్గవి- ధనుంజయ్ గౌడ్, తాత అమ్మమ్మ బద్దం వారి బంధు ఘనం చిన్నారితో కేక్ కట్ చేయించి జన్మదిన అభినందనలు తెలిపారు బద్దం వారి పుట్టినరోజు వేడుకలకు హాజరైన ప్రముఖులకు, ప్రముఖ వ్యాపారవేత్తలకు, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం నాయకులకు, రాజకీయ నాయకులకు, బద్దం ధనుంజయ్ గౌడ్ సాదరంగా స్వాగతం పలికారు

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

వార్త మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత) .. నవంబర్ 14 == మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ బడంగ్ పేట్ లోని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ ముఖ్యఅతిథిగా హాజర్యాయరు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మనోజ్, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలి

మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ

విశాఖపట్నం వార్త మిర్రర్ సముద్రాన్నే నమ్ముకొని తర తరాలుగా జీవిస్తున్న మత్స్య కారుల సమస్యలను పరిష్కరించి వారి జీవన విధానంలో మెరుగైన మార్పులు వచ్చేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిం చాలని విశాఖజిల్లా మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ కోరింది. మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించి జోనల్ కమీషనర్ కి వినతిపత్రం సమర్పించి ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సమావేశంలో మత్స్యకారుల నాయకులు మాట్లాడారు గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూక రాజు,పేర్ల విజయ్ చందర్,పిసి అప్పారావు,చెన్నా దాసు,కారి అప్పారావు,విశాఖ మరబోట్ల యూనియన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు,కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు,చురకల రమణ, మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావులు మాట్లాడుతూ తరతరాలుగా సముద్రాన్నే నమ్ము కొని జీవనం సాగిస్తున్న మత్స్య కారులయొక్క బ్రతుకులకు ప్రభుత్వాలనుండి పూర్తిస్తాయి భరోసా కరువయిందని అన్నారు సిఆర్జెడ్ నిబంధనలకు విరుద్ధంగా తీరంలో ఎన్నో రకాల కట్టడాలకు ప్రభుత్వ అధికారులు ఎలా అను మతులు ఇస్తున్నారని అన్నారు చివరికి ఎన్నో తరాలుగా మత్స్య కారులు ఉపయోగించుకుంటున్న స్మశానవాటికను కూడా భూ బకా సురులు కబ్జా చేసి బార్ అండ్ రెస్టారెంట్ లు కట్టుటకు ఎలా అను మతులు ఇచ్చారో అర్థం కావడం లేదని అన్నారు సిఆర్ జెడ్ నిబంధనలు మత్స్యకారులకే వర్తిస్తాయా ? బడాబాబులకు కబ్జా దారులకు వర్తించవా? అని నిల దీశారు ప్రజల ప్రాణాలతో చెల గాటం ఆడే కాలుష్యాన్ని విష వ్యర్థ పదార్థాలను విడుదల చేసే పరి శ్రమలకు వర్తించవా? అని అన్నారు మత్స్యకారులు వలలు, తెప్పలు,బోట్లు,విలువైన వేట సామాగ్రిని పెట్టుకొనుటకు తీరంలో చోటు లేకుండా చేస్తున్నా అధి కారులు ఎందుకు మౌనం వహి స్తున్నారని అన్నారు దీనినిబట్టి అధికారులు పరోక్షంగా కబ్జాదారు లకు సహకరిస్తున్నారని బావించ వచ్చా అని అడిగారు మానవ జీవితంలో స్మశానం అనేది చాలా ముఖ్యమైనదని అన్నారు కులం, మతం,ప్రాంతంతో సంబంధం లేకుండా అందిరికి ఇది చాలా ముఖ్యమైన ఘట్టం అని అన్నారు మత్స్యకారులైతే స్మశానాన్ని దైవ మందిరంగా భావిస్తామని అన్నారు మరణించిన వ్యక్తిని స్మశానంలో ఖననం చేసి వచ్చిన తరువాత ఆ వ్యక్తిని తిరిగి ఇంటికి డప్పు,వాయి ద్యాలతో దైవంగా బావించి ఇంటికి తోడ్కోని వస్తామని అన్నారు అలాంటి దైవమందిరాలుగా ఉప యోగించే స్మశానాన్ని కబ్జా చేసి హోటల్ కట్టి సమాధులమీద రేవ్ పార్టీల పేరిట వికృత శ్రేష్ఠలకు నాంది పలికిన వారికి అధికారులు ఎందుకు సహకరిస్తున్నారనన్నారు కబ్జా చేస్తున్నారని అధికారులకు పిర్యాదు చేస్తే తిరిగి అదే స్థలంలో ఇచట శవాలను ఖననం చేయ రాదుని బోర్డులు పెట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు తీరంలో వేటకు వెళ్లే మత్యాకారుల రక్షణ కోసం మేలుగట్టు నిర్మించాలని తీర ప్రాంతంలో పడవలకు,వలలకు రక్షణ కల్పించాలని,తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేసారు బేఆప్ బెంగాల్ కు చెందిన స్థలాల్లో రిజిస్ట్రేషన్లకు అను మతులు నిరాకరించాలని అన్నారు వేటకు వెళ్ళుటకు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు సి ఆర్ జెడ్ మరియు నో డెవలప్మెంట్ జోన్లో ఇప్పటికే నిర్మించిన అక్రమ కట్టడాలను పూర్తిగా కూల్చివేయాలి మత్స్య కారుల చిరకాల వాంచ భీమిలిలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని డిమాండ్ చేసారు మత్స్య సంపదను నాశనం చేస్తున్న విష వాయువులు వెదజల్లే పరిశ్రమ లను అరికట్టాలి కాలుష్య నియంత్రణ మండలి మత్స్య కారుల అభిప్రాయాలను ఎప్పటి కప్పుడు తీసుకోవాలి మత్స్య కారుల మనోభావాలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు అనంతరం సముద్రం మా జీవనం తీరం మాహక్కు అంటూ నినాదం చేసారు జై మత్స్యకారా జైజై మత్స్యకార అంటూ మత్స్య కారుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసారు ఈ కార్య క్రమంలో విశాఖ జిల్లాలో ఉండే ఎగువపేట,బోయవీధి,తోటవీధి ఋషికొండ,తిమ్మాపురం,ఉప్పాడ మంగమారిపేట,నాగమయ్య పాలెం,అన్నవరం గ్రామాల నుండి అధికసంఖ్యలో మత్స్యకారుల మహిళలు మత్స్యకారులు పాల్గొన్నారు.